అనంతగిరిలో భారీ వర్షం

వికారాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా శనివారం మోస్తరు వర్షం కురిసింది. అనంతగిరిలో అరగంట పాటు భారీ వర్షం కురిసింది. నవాబ్‌పేట్‌లో 37.8 మి.మీ, బంట్వారంలో 19.5, వికారాబాద్‌లో 12.5, పెద్దేముల్‌లో 7.3 , దోమలో 5.8, మర్పల్లిలో 5.0, పూడూరులో 2.8, కొడంగల్‌లో 2.0, ధారూరులో 1.8 మి.మీ., యాలాల్‌లో 1.3 మి.మీ., కోట్‌పల్లిలో 0.8 మి.మీ., మోమిన్‌పేట్‌లో 0.5 మి.మీ., వర్షపాతం నమోదైంది. పరిగిలోనూ మోస్తరు వర్షం కురిసింది.

ఈ దారి.. పూల దారి



ఈ దారి.. పూల దారి.. ఆ మార్గంలో వెళ్లే వారికి రోడ్డుకు ఇరువైపులా చెట్లకు పూసిన పూలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. బషీరాబాద్-తాండూరు ప్రధాన రోడ్డు మార్గం గొట్టిగఖుర్దు సమీపంలో రోడ్డుకు కిలో మీటరు మేరకు ఇరువైపులా ఉన్న గుల్‌మోహర్ చెట్లకు పూసిన పూలు ప్రయాణికులకు స్వాగతం పలుకుతున్నాయి. కాషాయ వర్ణంలో విరగబూసిన పూలు ఈ మార్గంలో వెళ్తున్న వాహనదారులకు పూల పందిరి వేసి స్వాగతం పలుకుతూ కనువిందు చేస్తున్నాయి. ఈ చెట్లు బాటసారులకు వేసవిలో నీడను, చల్లదనాన్ని పంచుతున్నాయి. దీంతో ప్రకృతి ప్రేమికులు, ప్రయాణికులు సెల్ఫీలు దిగుతూ మురిసిపోతున్నారు. - బషీరాబాద్, మే 18

అకాలం.. అన్నదాతలు ఆగం



ఆరుగాలం కష్టించి పంటలు పండించిన రైతులకు అడుగడుగునా కష్టాలు వెంటాడుతున్నాయి. పంట చేతికొచ్చి అమ్ముకుందామనుకుంటున్న తరుణంలో అకాల వర్షాలు రైతన్నలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని విక్రయించేందుకు తీసుకొచ్చిన రైతులకు నిత్యం కష్టాలు తప్పడంలేదు. నాలుగైదు రోజులుగా అడపాదడపా వానల నుంచి ఆర బెట్టిన ధాన్యం కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. ప్రతి రోజు ధాన్యం ఆరాబోస్తూ, సాయంత్రం కాగానే తడవకుండా కుప్పలు కట్టి టార్పాలిన్లతో సంరక్షించుకుంటున్నారు.

ప్రమాదకరంగా హోర్డింగ్‌లు

ఈదురుగాలులతో పొంచిఉన్న ప్రమాదాలు



ఈదురుగాలులకు పడిపోయిన భారీ హోర్డింగ్ (ఫైల్)

మేడ్చల్ మే 18(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ముందే అకాల వర్షాలు... దీనికి ఈదురుగాలుల తోడవడంతో హోర్డింగులు, ఫ్లెక్సీలు ఎక్కడ కూలి మీద పడతాయోనన్న భయం జిల్లా ప్రజలను వెంటాడుతోంది. ఇటీవల ముంబయిలో అక్రమంగా ఏర్పాటు చేసిన భారీ హోర్డింగ్ కూలి 16 మంది ప్రాణాలు కోల్పోయిన ఉదంతం సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది. జిల్లాలో పలు ప్రాంతాల్లో భవనాలపై ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు ప్రమాదకరంగా మారుతున్నాయి. ప్రచారం కోసం ఏర్పాటు చేసే హోర్డింగ్‌ల పట్ల ప్రమాదాలు పొంచివున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. జిల్లాలో జాతీయరహదారి వెంబడి గల పలు భవనాలపై ప్రచారం కోసం భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు. ఈదురుగాలులకు భవనాలపై ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు పడిపోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నప్పటికీ పట్టించుకునే వారే కరువయ్యారు. డబ్బులకు ఆశపడి పలువురు భవనాల యజమానులు తమ తమ భవనాలపై హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ హోర్డింగ్‌లకు ఎటువంటి రక్షణ లేకపోవడంతో ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం జనసంచారం కల్గిన ప్రాంతాల్లో ఉన్న భవనాలపై భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడం ఆందోళన కల్గిస్తున్నది. తేలికపాటి ఇనుప రాడ్లతో పెద్ద సైజులో హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడం వలన భారీ ఈదురుగాలులకు హోర్డింగ్‌లు ఓ వైపు ఒరిగిపోయి ప్రమాదకరంగా మారుతున్నాయి. హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడంలో భవన యజమానులు కనీస నియమ నిబంధనలు పాటించడం లేదు. ప్రమాదాలు జరిగినప్పుడు స్పందించేకంటే ముందస్తుగా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడంలో కనీస చర్యలు చేపట్టేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదాయానికి గండి...

జిల్లాలోని పలు మున్సిపాల్టీలు, కార్పోరేషన్లలో నిబంధనలకు విరుద్ధంగా హోర్డింగులు, ఫ్లెక్సీలు , కటౌటులు ఏర్పాటు చేస్తున్నారు. దీనిపై యంత్రాంగం పర్యవేక్షణ అంటూ ఏమీ ఉండటం లేదు. పైగా అంచనాకు తగ్గట్టు ఆదాయాన్నీ సమకూర్చుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రచార ప్రకటనల ద్వారా రావాల్సిన రూ.లక్షల ఆదాయానికి గండిపడుతోంది. దీనికి తోడు ఎలాంటి రక్షణ పాటించకుండా హోర్డింగులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానంగా హోర్డింగుల ఏర్పాట్లపై నియంత్రణ, నిర్వహణలో అధికారులపై మితిమీరిన రాజకీయ జోక్యం, ప్రముఖ సంస్థల ఒత్తిళ్లు తొలగితేనే సమస్యకు పరిష్కారం దొరుకుతుందనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తం అవుతోంది.

అనుమతి లేని విత్తనాలు విక్రయించొద్దు

బొంరాస్‌పేట్, మే 18: ఫర్టిలైజర్స్ దుకాణాల్లో ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలు, పురుగు మందులను విక్రయించొద్దని మండల వ్యవసాయ శాఖ అధికారి అనురాధ తెలిపారు. శనివారం ఆమె మండలంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు, ఫర్టిలైజర్స్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా అనుమతించిన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని సూచించారు. కొనుగోలు చేసిన విత్తనాలు, పురుగు మందులకు బిల్లులు అందించాలన్నారు. స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు సూచిక బోర్డులపై ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సప్లిమెంటరీకి సన్నద్ధం!

విద్యార్థులకు ప్రత్యేక తరగతులు!

పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ కావడానికి దారితీసిన కారణాలపై ఇప్పటికే విశ్లేషించిన విద్యా శాఖ ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యే విధంగా చర్యలు చేపట్టింది. విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం నష్టపోకుండా సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉన్నత చదువులకు వెళ్లే విధంగా చేయాలనే లక్ష్యంతో జిల్లా విద్యాశాఖ ప్రత్యేక తరగతులకు శ్రీకారం చుట్టింది. మరో పదిహేను రోజుల్లో పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలో ఇప్పటికే 42 ప్రభుత్వ, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి.



విద్యార్థులకు కొనసాగుతున్న ప్రత్యేక తరగతులు

- జిల్లాలో 4,662 మంది పదో తరగతి విద్యార్థులు ఫెయిల్
- పరీక్షలకు సన్నద్ధం చేసే దిశగా విద్యాశాఖ చర్యలు
- ఇప్పటికే 42 ఉన్నత పాఠశాలల్లో ప్రారంభమైన తరగతులు

సబ్జెక్టులు	ఫెయిలైన విద్యార్థులు
మ్యాథమెటిక్స్	3,180
సైన్స్	2,252
తెలుగు	1,315
సోషల్ స్టడీస్	1,033
ఇంగ్లీష్	735
హిందీ	72

వికారాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులను సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం చేసే విధంగా జిల్లా విద్యా శాఖ చర్యలు చేపట్టింది. సప్లిమెంటరీ పరీక్షల్లో రాణించేందుకు వీలుగా సంబంధిత సబ్జెక్టుల్లో ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. వచ్చేనెల మూడవ తేదీ నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖ ప్రకటించిన నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ముగియగానే ప్రత్యేక తరగతులు ప్రారంభించేలా చర్యలు చేపట్టింది. రెండు, మూడు సబ్జెక్టుల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిలైతే రోజుకు రెండు సబ్జెక్టుల ఉపాధ్యాయులు, కొందరే ఉంటే ఒక ఉపాధ్యాయుడితో సబ్జెక్టు ముఖ్యమైన పాఠ్యాంశాలు బోధించే విధంగా కసరత్తు చేసింది. మరో పదిహేను రోజుల్లో సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలో ఇప్పటికే 42 ప్రభుత్వ, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రత్యేక తరగతులు ఇంకా ప్రారంభించని పాఠశాలల్లోనూ త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలంటూ విద్యా శాఖ అధికారులు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఈ విషయమై ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో డీఈవో రేణుకాదేవి సమీక్షిస్తున్నారు.

మ్యాథ్స్, సైన్స్‌లోనే ఎక్కువ..

గతనెల 30వ తేదీన విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో వికారాబాద్ జిల్లా రాష్ట్రంలో చివరి స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. గత ఏడాది కంటే ఈ ఏడాది ఉత్తీర్ణతా శాతం పెరిగినా.. రాష్ట్ర స్థాయి ర్యాంకు విషయం లో మాత్రం గత ఏడాది నిలిచిన విధంగానే ఈసారి కూడా 33వ స్థానం తప్పలేదు. గత ఏడాది పదో తరగతి ఫలితాల్లో జిల్లా 59.46 శాతం ఉత్తీర్ణతతో 33వ స్థానంలో నిలిస్తే., ఈ ఏడాది పరీక్షా ఫలితా ల్లో 65.10 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఈసారి కూడా 33వ స్థానంలో నిలవడం పట్ల తల్లిదండ్రులు, విద్యావేత్తల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో 13,357 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 4662 మంది ఫెయిల్ అయ్యారు. పరీక్షలకు బాలురు 6,664 మంది హాజరు కాగా, 2843 మంది ఫెయిల్ అయ్యారు. 6,693 మంది బాలికలు పరీక్షలకు హాజరైతే వారిలో 1819 మంది ఫెయిల్ అయ్యారు. పదో తరగతి పరీక్షల్లో తప్పిన విద్యార్థుల్లో ఎక్కువగా మేథమెటిక్స్, సైన్స్ సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడం గమనార్హం.

కొరవడ్డ పర్యవేక్షణ..

పదో తరగతి విద్యార్థుల చదువులు ఏ విధంగా కొనసాగుతున్నాయనేది క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ, తనిఖీలు కొరవడ్డాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయలతో పాటు విద్యా శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తే విద్యార్థుల చదువులు ఏ విధంగా కొనసాగుతున్నాయనేది తెలిసేది. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే విద్యార్థుల చదువులపై ప్రత్యేకంగా దృష్టి సారించి ఉంటే మరింత మెరుగైన ఫలితాలు వచ్చి ఉండేవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. విద్యార్థుల చదువులు, ఉపాధ్యాయుల విద్యాబోధనపై ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణ ఉండాలి. అయితే కొన్ని పాఠశాలల్లో ఇది కొరవడింది.

పట్టులేకపోవడమే..

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లా చివరి స్థానంలో నిలవడానికి ప్రధాన సబ్జెక్టుల్లో విద్యార్థులకు ఆశించిన స్థాయిలో పట్టు లేకపోవడమేననేది స్పష్టమవుతోంది. పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థుల్లో ఎక్కువ శాతం మేథమెటిక్స్, ఆ తరువాత సైన్స్ సబ్జెక్టుల్లో కనీస ఉత్తీర్ణత మార్కులు సాధించలేకపోయారనేది వెలుగులోకి వచ్చింది. మాతృభాష తెలుగు సబ్జెక్టులోనూ విద్యార్థులు తడబడడం గమనార్హం. సోషల్ స్టడీస్, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లోనూ విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. అన్ని సబ్జెక్టుల కంటే హిందీలోనే విద్యార్థులు ఎక్కువ శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషం.

అభ్యసన సామర్థ్యాలు అంతంతే..

ఇంతకు ముందు పదో తరగతికి 11 పరీక్షా పేపర్లు ఉండేవి. హిందీ సబ్జెక్టు మినహా ఇతర సబ్జెక్టులకు పేపర్-1, పేపర్-2 పరీక్షలు నిర్వహించేవారు. గత ఏడాది విద్యా శాఖ 11 పేపర్లను ఏడు పేపర్లకు కుదించింది. ఒక్క సైన్స్ సబ్జెక్టుకు పేపర్-1, పేపర్-2 ఉండగా, మిగతా సబ్జెక్టులకు ఒక్కొక్క పరీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కొవిడ్ కారణంగా విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. అప్పట్లో ఆన్‌లైన్‌లో నిర్వహించిన తరగతులపై విద్యార్థులు అంతగా శ్రద్ధ పెట్టకపోవడంతో వారి చదువులు పట్టుతప్పాయి. అభ్యసన సామర్థ్యాలు అంతంత మాత్రంగానే ఉన్న పాఠశాలల్లో ఫలితాలు నిరాశాజనకంగా వచ్చాయి.ఉపాధ్యాయుల కొరత ప్రభావం పదో తరగతి ఫలితాలపై పడింది. ఫెయిలైన విద్యార్థులు ప్రత్యేక తరగతుల నిర్వహణతో పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తారని డీఈవో రేణుకాదేవి పేర్కొన్నారు.



జిల్లాలో 92 పాఠశాలలు

జిల్లాలో 92 ఉన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులు లేరు. ఆ పాఠశాలలు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులతో కాలం వెళ్లదీస్తున్నారు. పూర్తి స్థాయి ప్రధానోపాధ్యాయులు ఉంటేనే విద్యార్థుల చదువులపై, ఉపాధ్యాయుల బోధనపై పర్యవేక్షణ ఉంటుంది. ఇదిలా ఉంటే, గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికలు కూడా విద్యార్థుల చదువులు పట్టు తప్పడానికి కొంత కారణంగా మారాయి. కొందరు ఉపాధ్యాయులు ఎన్నికల నిర్వహణ విధుల్లో కీలకంగా మారారు. ఎన్నికలు ముగిసే వరకు విద్యార్థుల చదువులు అంతంత మాత్రంగానే కొనసాగాయన్న విమర్శలు ఉన్నాయి. ఇదిలా ఉంటే, గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా జిల్లాలో పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తారనే విషయం ఉపాధ్యాయులు స్పష్టంగా చెప్పినా కొందరు విద్యార్థులు పెడచెవిన పెట్టి ఫెయిల్ అయ్యారు. రోజూ క్రమం తప్పకుండా సాధన చేస్తే తప్ప పట్టు సాధించలేని మేథమెటిక్స్, సైన్స్ వంటి సబ్జెక్టుల్లో విద్యార్థుల ఎక్కువ మంది ఫెయిల్ అయ్యారు. తెలుగు, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్ పరీక్షల్లో ప్రశ్నలను సరిగా అర్థం చేసుకుని సమాధానాలు రాయడంలో విద్యార్థులు తడబడ్డారు.

వసతిగృహాలు సిద్ధం చేయాలి

- సాంఘిక సంక్షేమ స్థాయి సంఘం చైర్‌పర్సన్ అరుణాదేశు
- కోరం లేక మిగతా స్థాయి సంఘ సమావేశాలు వాయిదా
- హాజరుకాని జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



వికారాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి) : వచ్చేనెలలో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో వసతి గృహాలను సంసిద్ధం చేయాలని జడ్పీ సాంఘిక సంక్షేమ స్థాయి సంఘం చైర్‌పర్సన్ అరుణాదేశు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం జడ్పీ కార్యాలయంలో సాంఘిక సంక్షేమ స్థాయి సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పాఠశాలలు, కళాశాలలు ప్రారంభం కాక ముందే వసతి గృహాలను సిద్ధం చేయాలన్నారు. అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం దుస్తులు సిద్ధంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో వసతి గృహాల ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా క్రమం తప్పకుండా పరిశుభ్రతా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులకు సూచించారు. అనంతరం జడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయకుమార్ మాట్లాడుతూ, వాతావరణంలో ఊహించని విధంగా చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా సాగులో కూడా మార్పులు తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. విత్తనాలు ఆలస్యంగా కాకుండా ముందుగానే విత్తే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయాధికారులకు సూచించారు. రైతులకు ఎక్కడా కొరత ఎదురు కాకుండా అవసరమైన విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు. రైతు వేదికలను సద్వినియోగం చేసుకోవాలని, రైతులు సాగు చేసే పంటలపైన వారికి అవగాహన కల్పించాలన్నారు. శాస్త్రీయ వ్యవసాయం రైతులు అవలంబించే విధంగా ప్రోత్సహించాలని కోరారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో సుధీర్, స్థాయి సంఘం సభ్యులు సంతోష, ధారాసింగ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.


కోరం లేక సమావేశాలు వాయిదా

ఇదిలా ఉంటే, శనివారం వ్యవసాయం, మహిళా సంక్షేమం, సాంఘిక సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, విద్యా, వైద్య సేవలు, పనులు, ప్రణాళిక, పనులు, ఆర్థిక సంఘాల సమావేశాలు జరగాల్సి ఉండగా, వాటిలో సాంఘిక సంక్షేమం స్థాయి సంఘ సమావేశం మాత్రమే కొనసాగింది. మిగతా స్థాయి సంఘాల సభ్యులు కోరం మేరకు హాజరు కాకపోవడంతో ఆ సమావేశాలు వాయిదా పడ్డాయి. కాగా, ఈ సమావేశాలకు జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి హాజరుకాలేదు. జడ్పీ చైర్‌పర్సన్‌పై బీఆర్‌ఎస్ పార్టీ జడ్పీటీసీలు అవిశ్వాసం ప్రకటిస్తూ నోటీసు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో సునీతారెడ్డి మల్కాజ్‌గిరి పార్లమెంటు స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన విషయం తెలిసిందే.

జైలు జీవితం గడిపిన వారిలో పరివర్తన రావాలి

- జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి

పరిగి,మే 18: జైలు జీవితం గడిపిన ప్రతి ఒక్కరిలో పరివర్తన రావాలని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం పరిగిలోని సబ్‌జైలును సందర్శించారు. ఖైదీలతో మాట్లాడి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. జైల్లో ఖైదీల రోజువారి దినచర్య, వసతుల గురించి జైలు అధికారి రాజ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, క్షణికావేశంతో చేసిన తప్పుల వల్ల కేసుల్లో ఉన్నవారే కాకుండా కుటుంబ సభ్యులు కూడా క్షోభకు గురవుతారని, అందుకు మొదటిసారి చేసిన తప్పులు మరోసారి పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు. జైలు నుంచి విడుదలైన తర్వాత రెండోసారి జైలుకు రాకుండా సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఆర్థిక స్థోమత లేని పేద ఖైదీలకు జిల్లా న్యాయ సేవా సంస్థ ద్వారా ఉచితంగా డిఫెన్స్ లాయర్‌ను ఇచ్చి, బెయిల్ మంజూరీ చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా న్యావ సేవా సంస్థల ద్వారా ఉచితంగా సేవలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో లీగల్ డిఫెన్స్ లాయర్ రాములు, వెంకటేశ్, జైలు సిబ్బంది విశ్వనాథరావు, పరమయ్యశ్రీనులు ఉన్నారు.



మేడ్చల్ మే 18(ఆంధ్రజ్యోతి) : ఈనెల 24 నుంచి జూన్ 3 వరకు జరిగే ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. శనివారం అదనపు కలెక్టర్ చాంబర్‌లో ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలపై నిర్వహించిన సమావేశంలో అధికారులతో మాట్లాడుతూ పరీక్షలను సంబంధిత అధికారులు ఇతర అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ పనిచేయాలన్నారు. జిల్లాలో 50,443 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారని, 89 సెంటర్లు ఉన్నాయన్నారు. మొదటి సంవత్సరంనకు గాను 36,940, ద్వితీయ సంవత్సరం 13,503 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షా కేంద్రాలకు నిరంతరం విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు ప్రతీ రోజు తాగునీటిని ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. డీఐఈవో కిషన్, ఏసీపీ చంద్రకుమార్, సత్యనారాయణ, విద్యుత్ శాఖ అధికారి సతీష్, పోస్టల్ అధికారి సంపత్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి















కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు కలిగించొద్దు

● వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్

దోమ, మే 18: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని వ్యవసాయ శాఖ వికారాబాద్ జిల్లా అధికారి గోపాల్ అన్నారు. శనివారం దోమ మండలంలోని బొంపల్లి గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అకాల వర్షాల కారణంగా రైతులు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం తడవకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిర్వాహకులను సూచించారు. తరుగు, తాలు పేరుతో ఇబ్బందులకు గురి చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సాయి, తేజ, రైతులున్నారు.


బొంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఏవో

శిఖం భూమిలో ఆక్రమణలు తొలగించండి

కొత్తూరు. మే 18 : కొత్తూరు మున్సిపల్ పరిధిలోని చెరువు శిఖంలో నిర్మించిన ఆక్రమణలను తొలగించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కొత్తూరు మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం కొత్తూరు తండా వాసులు పత్లావత్ రెడ్యానాయక్, బాలునాయక్, రమేష్‌నాయక్, సోమ్లా నాయక్, రవినాయక్, నరేందర్ నాయక్, గోపాల్‌నాయక్, బాబు నాయక్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని సర్వేనెంబర్ 64లో నిర్మించిన వాటర్‌ఫిల్టర్, సర్వేనెంబర్ 83, 66లో ఆక్రమణలను తొలగించాలన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


కల్యాణంలో పాల్గొన్న వజ్రేష్‌యాదవ్, ప్రభాకర్ గౌడ్

మూడుచింతలపల్లి, మే 18: మండలంలోని కేశవరం గ్రామ పరిధిలో ఉన్న శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ కమిటీ సభ్యులు స్వామివారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్ హాజరై స్వామి వారి కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే భక్తులు, గ్రామస్తులు ఆలయానికి విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నర్సింహులుయాదవ్, వైస్ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ హన్మంత్‌రెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, నర్సింహులు, రాజేంద్ర ప్రసాద్, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యను పరిష్కరించాలి


ద్వారకనగర్‌లో మురుగునీటిని చూపిస్తున్న స్థానికులు

ఘట్‌కేసర్, మే 18 : ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని 18వ వార్డు పరిధిలో గల ద్వారకనగర్‌లో మురుగునీరు రోడ్డుపై పారుతున్న పట్టించుకోవడం లేదని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ నిర్మాణంను అస్తవ్యస్తంగా చేపట్టడంతో మురుగు మ్యాన్‌హోళ్ల నుంచి బయటకు వస్తున్నదని వాపోతున్నారు. మురుగునీరు రోడ్లపై పారుతుండటంతో దుర్వాసనతో సతమతమవుతున్నామని స్థానికులు ఆరోపించారు. కాగా, గత ఆరునెలలుగా మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు. స్థానిక కౌన్సిలర్ చెప్పిన మున్సిపల్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని కాలనీవాసులు హెచ్చరించారు.

కేబుల్ కోసం రోడ్ల పక్కన గుంతలు

● ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు

మర్పల్లి, మే 18: కేబుల్ వేసేందుకు ఆర్‌అండ్‌బీ రోడ్ల పక్కన ఇష్టానుసారంగా గుంతలు తీసిరోడ్లపై మట్టి వేయడంతో తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నాగిరెడ్డిపల్లి చౌరస్తా వరకు జియో కేబుల్ కోసం గుంతలు తీసి మట్టిని రోడ్డుపై పడేయడంతో తరచూ వాహనదారులు ఆ గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అక్కడ ఎలాంటి సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ఆ మార్గంలో ప్రమాదాలకు గురవుతున్నారు. కాగా, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు.


రోడ్డుపక్కన కేబుల్ వేసేందుకు తవ్విన గుంతలు

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు

● జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కోటిరెడ్డి, అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి

వికారాబాద్, మే 18 : గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జూన్ 9న నిర్వహించే పరీక్షకు సంబంధించి శనివారం తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, అదనపు కలెక్టర్లు, ఎస్పీలు, జిల్లా నోడల్ అధికారులు, పోలీస్ నోడల్ అధికారులు, రీజినల్ కోఆర్డినేటర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించి చేపట్టాల్సిన విధి విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించేందుకు వీలుగా 13 కేంద్రాలను గుర్తించడం జరిగిందన్నారు. వికారాబాద్‌లో 7, తాండూరులో 4 పరిగిలో 2 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు అన్ని వసతులతో సిద్ధం చేస్తున్నట్లు వారు తెలిపారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ సూచనల మేరకు పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

బందోబస్తు మధ్య పరీక్ష నిర్వహిస్తాం : ఎస్పీ కోటిరెడ్డి

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను భారీ పోలీసు బందోబస్తు మధ్య శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద మహిళా కానిస్టేబుల్, హోంగార్డులు విధులు నిర్వహించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి అమరేందర్ కృష్ణలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో.. జరదేఖో..

● ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



పాటిగడ్డ సమీపంలో ఒరిగిన విద్యుత్ స్తంభం

కేశంపేట, మే 18 : మండల పరిధిలోని అల్వాల-కేశంపేటకు వెళ్లే దారిలో పాటిగడ్డ సమీపంలో ఓ విద్యుత్ స్తంభం ప్రమాదభరితంగా ఉంది. కొత్తపేట విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు వెళ్లే 11 కేవీఏ లైన్‌కు సంబంధించిన స్తంభం పాటిగడ్డ సమీపంలో ఒక వైపుకు ఒరిగిపోయింది. కాగా, ఎన్నో రోజుల నుంచి విద్యుత్ స్తంభం అలాగే ఉంటుందని సమీప రైతులు తెలిపారు. వర్షాకాలంలో విద్యుత్ సమస్య తలెత్తకుండా ఉండాలంటే దానిని వెంటనే సరిచేయాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా చాలా చోట్ల కరెంటు వైర్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని రైతులు, గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అప్పుడు 40.. ఇప్పుడు 22 రోజులు

● లోక్‌సభ ఎన్నికల ఫలితాల కోసం నిరీక్షణ

తాండూరు, మే 18: లోక్ సభ ఎన్నికల ముగిసిన రోజు నుంచి ఫలితాల వెల్లడి కోసం 22 రోజులు నిరీక్షించాల్సిందే. దేశవ్యాప్తంగా ఏడు విడతలుగా ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికలను నిర్వహిస్తున్న విషయం విదితమే. ప్రస్తుతం ఈనెల 13న నాలుగో విడత ఎన్నికలు ముగిశాయి. మరో మూడు దశల్లో పోలింగ్ నిర్వహించాల్సి ఉంది. కాగా, అన్ని దశలు పూర్తి అయ్యాక జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపడతారు. అదేరోజు రాత్రి వరకు ఫలితాలు వెల్లడిస్తారు. ఇదిలా ఉంటే, 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో కూడా పోలింగ్ ముగిసిన తర్వాత 40 రోజులు ఫలితాల కోసం నిరీక్షించాల్సి వచ్చింది. కాగా, చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచి ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లతో పాటు మొత్తం 43 మంది అభ్యర్థులు బరిలో నిలిచిన విషయం విధితమే. ప్రస్తుతం మూడు పార్టీలు లెక్కింపునకు చాలా సమయం ఉండడంతో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు బూత్ వారిగా పడిన ఓట్ల వివరాలు తీసుకొని గ్రామం, వార్డు యూనిట్‌గా లెక్కలతో కుస్తీ పడుతున్నారు. అనేక కోణాల్లో విశ్లేషణలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో క్రాస్ ఓటింగ్ భయం కూడా జరిగిందని పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు.


ఎవరు గెలిచినా రికార్డే

● రసవత్తరంగా చేవెళ్ల పార్లమెంట్ సెగ్మెంట్ పోరు

● విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి.. ఎవరు గెలిచినా రెండోసారి ఎంపీ



గడ్డం రంజిత్‌రెడ్డి



కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు, మే 18: చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేసిన అభ్యర్థుల్లో ప్రధాన పార్టీకి చెందిన అభ్యర్థులు ఎవరు గెలిచినా రికార్డేనని చెప్పవచ్చు. ఈ సెగ్మెంట్ పరిధిలో ఎన్ని కలు హోరా హోరీగా సాగిన విషయం విదితమే. అధికార కాంగ్రెస్ పార్టీ తరఫున సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి, బీజేపీ నుంచి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి కాసాని జ్ఞానేశ్వర్‌లు పోటీలో నిలిచారు. ఇందులో విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి ఇద్దరు రెండోసారి పోటీలో నిలిచారు. కాసాని జ్ఞానేశ్వర్ కూడా పార్టీ మారి ఎంపీ బరిలో నిలబడ్డారు. 2014 ఎన్నికల్లో టీఆర్‌ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బరిలో దిగి.. కాంగ్రెస్ అభ్యర్థి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డిపై గెలుపొంది మొదటిసారి ఎంపీ అయ్యారు. 2019 ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా గడ్డం రంజిత్‌రెడ్డి బరిలో నిలిచి.. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డిపై 14 వేల పైచిలుకు ఓట్లతో గెలుపొందారు. ఈ ఇద్దరూ కూడా పార్టీ మారారు. ఆ తర్వాత పోటీ పడుతున్న ప్రస్తుత ఎన్నికల్లో విశ్వేశ్వర్‌రెడ్డి గెలిచినా.. రంజిత్‌రెడ్డి గెలిచినా.. అదే చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రెండోసారి ఎన్నికయ్యే చాన్స్ ఉంది. ఇద్దరూ ఈ ప్రాంత సమస్యలు తెలిసిన నేతలు. ఎవరు గెలిచినా రికార్డే. పార్లమెంటు స్థానాల పునర్విభజన తర్వాత జరిగిన మూడు ఎన్నికల్లో ఒక్కసారే చాన్స్ వచ్చింది. కానీ, ఈసారి గెలుపొందే వారికి రెండోసారి చాన్స్ వస్తుంది.

గురుకుల కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కులకచర్ల, మే 18: మండలంలోని బండవెల్కిచర్ల గిరిజన గురుకుల సంక్షేమ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశానికి బాలుర నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గంగారామ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో ఇక్కడే పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సీట్లు పోను.. మిగతా సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన జిల్లా, మండల పరిధిలోని ఆయా పాఠశాలలకు చెందిన గిరిజన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈనెల 23న కళాశాలలో జరిగే స్పాట్ అడ్మిషన్లకు ధ్రువపత్రాలతో విద్యార్థులు హాజరు కావాలని ఆయన కోరారు.

‘మహా’ జోన్లు మరో రెండు

● హెచ్ఎండీఏలో పాలనా సౌలభ్యానికి 6కు పెంపు
● శంకర్‌పల్లి, ఘట్‌కేసర్ జోన్ల విభజన
● మరింత వేగం కానున్న భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతులు

హైదరాబాద్ సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ)లో పాలనా సౌలభ్యం, భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతుల్లో మరింత వేగవంతానికి సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు చర్యలకు ఉపక్రమించారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాల అభివృద్ధిలో, రియల్ ఎస్టేట్ రంగాన్ని కొత్త పుంతలు తొక్కించడంలో కీలకమైన హెచ్ఎండీఏను ప్రజలకు మరింత దగ్గరకు చేర్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. హెచ్ఎండీఏలో అతిపెద్ద జోన్లుగా ఉండి రియాల్టీ వృద్ధికి దోహదపడుతున్న శంకర్‌పల్లి, ఘట్‌కేసర్ జోన్లను విభజన చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ రెండు జోన్లను విభజించి అందుకనుగుణంగా అధికారులను, ఉద్యోగులను నియమిస్తుండడంతో భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతులు మరింత సులభతరం కానున్నాయి. హెచ్ఎండీఏలోని పట్టణ ప్రణాళిక విభాగాన్ని పటిష్ఠ పరిచే దిశగా చర్యలు చేపట్టారు.

> హైదరాబాద్ మహా నగరంలో పలు రంగాల అభివృద్ధిలో వేగాన్ని మరింత పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పాలనా సౌలభ్యానికి అనుగుణంగా జోన్ల సంఖ్యను పెంచాలని నిర్ణయించారు. దీంతో ప్రస్తుతమున్న నాలుగు జోన్లు కాస్త ఆరు జోన్లుగా మారనున్నాయి.

హైదరాబాద్‌తో పాటు మరో ఆరు జిల్లాల్లో 7,257చదరపు కిలోమీటర్లలో హెచ్ఎండీఏ పరిధి విస్తరించి ఉంది. ఇందులో 70 మండలాలు, సుమారు వెయ్యి గ్రామ పంచాయతీలు, ఎనిమిది కార్పొరేషన్లు, 38కి పైగా మున్సిపాలిటీలున్నాయి. ఆయా ప్రాంతాలను ఆధారంగా చేసుకుని హెచ్ఎండీఏ ఏర్పడిన సందర్భంలో నాలుగు జోన్లు (శంకర్‌పల్లి, శంషాబాద్, మేడ్చల్, ఘట్‌కేసర్)గా ఏర్పాటు చేశారు. ఆయా జోన్ల పరిధుల్లో కనీసం 15 మండలాల నుంచి 20 మండలాల వరకు ఉంటాయి. హెచ్ఎండీఏ పట్టణ ప్రణాళిక విభాగానికి కీలకమైన ఈ జోన్లకు ప్లానింగ్ ఆఫీసర్, ఏపీఓ, జేపీఓ ఇతర ఉద్యోగులుంటారు. ఆయా జోన్లలో మాస్టర్ ప్లాన్‌ను అమలు చేయడంతో పాటు లేఅవుట్లు, గేటెడ్ కమ్యూనిటీ లేఅవుట్లు, బహుళ అంతస్తుల భవనాలకు అనుమతులు, భూ వినియోగ మార్పిడులు, ఎన్‌ఓసీలను వీరు జారీ చేస్తారు.

విస్తరణతో పెరిగిన ఒత్తిడి

దశాబ్ద కాలంలో హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాలు గణనీయంగా విస్తరిస్తున్నాయి. ఔటర్ రింగ్ రోడ్డు కేంద్రంగా చేసుకుని జరుగుతున్న అభివృద్ధితో పెద్దఎత్తున లేఅవుట్లు, గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, బహుళ అంతస్తుల భవనాలు వస్తున్నాయి. పలు రకాల పరిశ్రమలు, గోడౌన్లు, మాన్యుఫాక్చరింగ్ యూనిట్లు, ఆటోమొబైల్ తదితర రంగాలకు చెందిన కంపెనీలు భారీగా శివారు ప్రాంతాల్లో ఏర్పడుతున్నాయి. దీంతో హెచ్ఎండీఏకు యేటా వివిధ రకాల అనుమతుల కోసం భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. లేఅవుట్లు, గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, బహుళ అంతస్తుల భవనాలు, గోడౌన్లు, పెట్రోల్ బంక్‌లు ఇలా వివిధ అనుమతుల కోసం వచ్చే దరఖాస్తులతో హెచ్ఎండీఏలో ప్లానింగ్ విభాగంపై భారీగా ఒత్తిడి పెరిగింది. 2012 తర్వాత ఒక్క ఖాళీ పోస్టును కూడా భర్తీ చేయలేదు. దీంతో ప్లానింగ్ విభాగంలో 110మంది అధికారులు, ఉద్యోగులు ఉండాల్సిన చోట 30మందితోనే నెట్టుకొస్తున్నారు. నగరం చుట్టురా జరుగుతున్న అభివృద్ధి, పెరుగుతున్న దరఖాస్తులతో ప్లానింగ్ విభాగంలోని జోన్లపై ఒత్తిడి పెరిగింది.



శంకర్‌పల్లి, ఘట్‌కేసర్ జోన్ల విభజన

ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిలో కీలకమైన హెచ్ఎండీఏలోని ప్లానింగ్ విభాగాన్ని పటిష్ఠపర్చాల్సి ఉండగా పదేళ్లుగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో కొందరు అధికారులదే ఇష్టారాజ్యంగా మారింది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి హెచ్ఎండీఏపై ప్రత్యేక దృష్టిసారించారు. హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగంలో కీలకమైన నాలుగు జోన్లను ఆరుకు పెంచేందుకు కసరత్తు చేస్తున్నారు. దరఖాస్తులు పెద్దఎత్తున వచ్చే శంకర్‌పల్లి జోన్‌ను రెండుగా విభజించి పటాన్‌చెరు లేదా సంగారెడ్డిని మరో జోన్ చేయాలని, దాదాపు 20కి పైగా మండలాలతో ఉన్న ఘట్‌కేసర్ జోన్‌ను రెండుగా విభజించి రాచకొండ జోన్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. జోన్లను విభజించి సంబంధిత పీవో, ఏపీవో, జేపీవో, డీఏవో ఇతర సిబ్బందిని నియమించనున్నారు. దీంతో అధికారులు, ఉద్యోగులపై పని ఒత్తిడి కూడా చాలా వరకు తగ్గనుంది. ప్రతీ దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి అనుమతులు వేగంగా ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. కాగా, జోన్ల పెంపుతో బహుళ అంతస్తుల భవనాలు, లేఅవుట్ల అనుమతులు హెచ్ఎండీఏలో మరింత వేగవంతమవుతాయని, దాంతో రియల్ ఎస్టేట్ వృద్ధికి, ఇతర రాష్ట్రాల సంస్థలను కూడా ఆకర్షించడానికి అవకాశాలుంటాయని ఈ సందర్భంగా ఓ ఉన్నతాధికారి తెలిపారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి చర్యలు : ఎమ్మెల్యే

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పరిగి, మే 18: పరిగి వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ‘ఆంధ్రజ్యోతి’లో ‘నీటికుంట కాదు... మార్కెట్ యార్డు..! అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే స్పందించారు. ఈ మేరకు శనివారం పరిగి మార్కెట్‌యార్డులో పర్యటించారు. రైతులు, వ్యాపారులతో కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ధాన్యం విక్రయించే స్థలాల్లో నీటికుంటలను చూసిన ఎమ్మెల్యే.. ఇదేం ఘోరం అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇంత ఘోరంగా ఉంటే మార్కెట్ అధికారులు ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం నీరు వెళ్లిపోయేలా చేసి, మట్టి పోసే పరిస్థితిలోనైనా ఉన్నారా? లేరా అని ప్రశ్నించారు. మార్కెట్ అధికారుల తీరుపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో ఏమేం పనులు చేపట్టాలో ప్రతిపాదనలు ఇవ్వాలని అధికారులకు సూచించారు. మార్కెట్‌యార్డులో రైతులు, వ్యాపారులకు, ప్రజలకు అన్నివసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, వ్యాపారులు బాల్‌రాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పరిగి వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

ధాన్యం కొనుగోలుకు సత్వర చర్యలు

● ప్రతీ వడ్ల గింజను కొనుగోలు చేస్తాం
● వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

తాండూరు రూరల్, మే 18 : వికారాబాద్ జిల్లాలో యాసంగిలో రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని, రైతులు ఎలాంటి అపోహలకు గురికావద్దని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. శనివారం తాండూరు మండల పరిధిలోని చెంగోల్ గ్రామ శివారులో గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు చెంగోల్ నుంచి ఎంతమంది రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేశారని తాండూరు గోదాం ఇన్‌చార్జి ఎల్లప్పను అడిగారు. కాగా, 17శాతం తేమ ఉన్న ధాన్యాన్నే తీసుకురావాలని, తేమ శాతం తక్కువ ఉంటే ధాన్యాన్ని ఆరబెట్టుకుని తీసుకురావాలని లింగ్యానాయక్ సూచించారు. ప్రతిరోజు 4-5 లారీల ధాన్యాన్ని మిల్లులకు పంపిస్తున్నట్లు పేర్కొన్నారు. ధాన్యాన్ని లారీలో నింపేందుకు కూలీల సంఖ్యను కూడా పెంచాలని సూచించారు. ఆన్‌లైన్‌లో ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఓపీఎంఎస్ ట్యాబ్) పొందుపర్చాలని ఆదేశించారు. టార్పాలిన్లను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు 129 కేంద్రాలు ఏర్పాటు చేశామని, వాటి ద్వారా లక్షా 19వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా కాగా, ఇప్పటివరకు 18వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి రూ.8కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. తరుగు కూడా ఎక్కువ తీయవద్దని, ఒక బస్తాకు 650 గ్రాముల వరి ధాన్యాన్ని తీయాల్సి ఉంటుందన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్, తహసీల్దార్ తారాసింగ్, డీసీఎంఎస్ మేనేజర్ ఎల్లయ్య, ఆర్ఐ బాల్‌రాజ్, చెంగోల్ గ్రామ రైతులు తదితరులున్నారు.



తాండూరు రూరల్ : కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న లింగ్యానాయక్

టార్పాలిన్లు అందుబాటులో ఉంచండి

పెద్దేముల్ : అకాల వర్షాలు కురుస్తున్నాయని, కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన రైతుల ధాన్యం తడిసిపోకుండా అవసరమైన టార్పాలిన్లు అందజేయాలని ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులను లింగ్యానాయక్ ఆదేశించారు. పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో డీసీఎమ్మెస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి ఏవైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా? అని ప్రశ్నించారు. టార్పాలిన్లు ఇవ్వడం లేదని, పూర్తిస్థాయిలో లేకపోవడం ధాన్యం తడిసిపోతోందని రైతులు చెప్పారు. దాంతో వారికి టార్పాలిన్లు అందజేయాలని నిర్వాహకులకు సూచించారు.

ప్రతీ గింజను కొనుగోలు చేస్తాం

బొంరాస్‌పేట్/యాలాల : రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామని లింగ్యానాయక్ అన్నారు. మండలంలోని తుంకిమెట్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతులు ధాన్యం కొనుగోలుపై ఎలాంటి అపోహలకు గురికావొద్దని తెలిపారు. సేకరించిన ధాన్యాన్ని సంబంధిత రైస్ మిల్లులకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం యాలాల మండలం బెన్నూర్ గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని లింగ్యా నాయక్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మద్దతు ధర చెల్లిస్తూ ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ధాన్యన్ని సేకరించాలని కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జిని ఆయన ఆదేశించారు. సేకరించిన ధాన్యాన్ని మిల్లర్లకు చేరే విధంగా చర్యలు తీసుకోవాని, ధాన్యాన్ని సేకరించి మేనేజ్‌మెంట్ సిస్టంలో పొందుపరచాలని తెలిపారు. ధాన్యం శుభ్రపరిచి, తేమశాతాన్ని దృష్టిలో పెట్టుకొని తీసుకువచ్చేలా రైతులకు వివరించాలన్నారు.

గ్రామాల్లో మొదలైన పంచాయతీ ఎన్నికల సందడి

● 2024 జనవరి 31తో ముగిసిన పాలక వర్గాల గడువు
● ఐదారు నెలలుగా ప్రత్యేకాధికారుల పాలనలో పల్లెలు
● మరో నెలలో ఎన్నికలు.. ఏర్పాట్లలో అధికార యంత్రాంగం!
● పార్టీల నాయకుల్లో మొదలైన టెన్షన్..



తుమ్మలూరు గ్రామ పంచాయతీ కార్యాలయం

మహేశ్వరం, మే 18 : మొన్నటి వరకు గ్రామాల్లో లోక్‌సభ ఎన్నికల హడావిడిలో మునిగితేలిన నాయకులకు.. ఇక పంచాయతీ ఎన్నికల సందడి ప్రారంభం కానుంది. గతేడాది జనవరి 31తో సర్పంచుల పదవీ కాలం ముగిసిపోగా.. అప్పటినుంచి ప్రత్యేకాధికారుల పాలనలోనే పల్లెలు కాలం వెల్లదీస్తున్నాయి. జూన్, జూలైలోనే పంచాయతీ ఎన్నికలు ఉంటాయని వార్తలు గుప్పుమనడంతో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఎన్నికల నిర్వహణకు కసరత్తు ప్రారంభించిందన్న వార్తలు గ్రామాల్లో కోడై కూస్తున్నాయి. ఐదు నెలల క్రితమే ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేపట్టాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అధికారులు, సిబ్బంది వివరాలను టీ పోల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించింది. ఇప్పటివరకు గ్రామ పంచాయతీల వారిగా అమల్లో ఉన్న రిజర్వేషన్ల వివరాలను జిల్లా పంచాయతీ అధికారుల నుంచి సేకరించింది. ఓటర్ల జాబితాను గ్రామ పంచాయతీ వార్డుల వారిగా విభజించి అభ్యంతరాల స్వీకరణ అనంతరం తుది జాబితాను ప్రకటించనున్నారు. ఇప్పటికి మండలంలో మొత్తం 67,983 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 31 గ్రామపంచాయతీలు, 268 వార్డులు ఉండగా.. వీటికి సంబంధించిన వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఆయా గ్రామాల్లో సర్పంచులుగా కావాలనే ఆశతో ఉన్న వివిధ పార్టీల నాయకులు తమ పంచాయతీ, వార్డుల్లో ఏ రిజర్వేషన్ వస్తుందోనని ఎదురు చూస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న ఆశావహులు రిజర్వేషన్ల విషయంలో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నిన్న మొన్నటి వరకు లోక్‌సభ ఎన్నికల్లో బిజీ బిజీగా ఉన్న నాయకులు ఇకనుంచి పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కాక తప్పడంలేదు. ఎన్నికల సమయం రోజు రోజుకూ దగ్గర పడుతుండడంతో ఏ క్షణంలోనైనా ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుందనే చర్చలు జోరుగా సాగుతున్నాయి. అంతే కాకుండా గ్రామాల్లో ఎక్కువశాతం బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిదులు ఉండగా.. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో కొందరు బీఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అంతే కాకుండా గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారు ఇప్పటి నుంచే యువతను మచ్చిక చేసుకోవడానికి విందులు ఏర్పాటు చేస్తున్నారు. ఏమవ్వా బాగున్నావా? ఏం తాత బాగున్నావా? అంటూ ఆప్యాయతతో పలకరింపులు మొదలయ్యాయి. కొన్ని మేజర్ గ్రామ పంచాయతీల్లో మాత్రం ఓటుకు రూ.5 నుంచి 10 వేలు కూడా ఖర్చు చేయడానికి నేతలు తగిన వనరులను సమకూర్చుకుంటున్నట్లు సమాచారం. అయితే, మహేశ్వరం మండల కేంద్రంతో పాటు సిరిగిరిపురం, మన్‌సాన్‌పల్లి, గంగారం, తుమ్మలూరు, మొహబత్‌నగర్, కేసీ తండా, ఎన్డీతండాలను కలుపుకొని మున్సిపాలిటీ ఏర్పాటు చేస్తే మాత్రం 31 గ్రామ పంచాయతీల్లో 8 మున్సిపల్ పరిధిలోకి వస్తే 23 గ్రామాలకు మాత్రమే పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయి.



విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ప్రధాన రోడ్డు పక్కన మురుగుతో నిండిన కాలువ

అస్తవ్యస్తంగా మురుగునీటి వ్యవస్థ

● పట్టించుకోని అధికారులు.. స్థానికుల ఇబ్బందులు

బషీరాబాద్, మే 18: మండల కేంద్రంలో మురుగు నీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ప్రత్యేక పాలనలో నిధులలేమి, పట్టించుకునే వారు కరువై ఎక్కడికక్కడా మురుగుకాల్వలు నిండి దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఫలితంగా మురుగునీరు రోడ్లపైకి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బషీరాబాద్-తాండూరు రోడ్డు మార్గంలో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ప్రధాన రోడ్డులోని కల్వర్టు కింద కాల్వ నిండి మురుగునీరు రోడ్డెక్కుతోంది. ఈ కాలువ చెత్తాచెదారంతో పూడుకుపోయి మురుగునీరు ముందుకు పారడం లేదు. కాల్వకు అటువైపు పాడుమట్టిని వేయడంతో మురుగునీటికి పారుదలకు ఆటంకం ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. కాగా, ఈ కాల్వను పంచాయతీ పారిశుధ్య సిబ్బంది అప్పడప్పుడూ శుభ్రం చేస్తున్నా.. పరిస్థితి మాత్ర యథావిధిగా ఉంటుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను శాశ్వతంగా పరిష్కారించాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి పల్లకీ సేవ

షాద్‌నగర్ అర్బన్, మే 18 : షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధి చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి ఆ లయంలో పల్లకీ సేవను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి పూజలానంతరం ఉత్సవ విగ్రహాలకు పల్లకీ సేవను నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాల వితరణ, అన్నదానం చేశారు. షాద్‌నగర్‌కు చెందిన మంగ-రాజు భక్తులకు అన్నదానం చేశారు. అలాగే కక్కులూరుకు చెందిన కృష్ణయ్య 20కిలోల బియ్యం, గంట్లవెల్లి గ్రామానికి చెందిన తులసీరామ్‌నాయక్ 5కిలోల నూనె ఆలయానికి విరాళంగా ఇచ్చారు. ప్రతీ శనివారం నిర్వహిస్తున్న పల్లకీ సేవకు సహకారం అందిస్తున్న భక్తులకు ఆలయ అభివృద్ధి కమిటీ కన్వీనర్ పి.శ్రీశైలంగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.



హనుమాన్ పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

నన్ను జర పట్టించుకోండి..!



అమరుల స్థూపం వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం

వికారాబాద్ 18 : వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం పక్కనే ఏర్పాటు చేసిన అమరుల స్థూపం అపరిశుభ్రంగా దర్శనమిస్తోంది. ప్రధాన రోడ్డులో అమరులకు గౌరవ సూచికంగా నిర్మించిన స్థూపాన్ని కనీసం ఎవరూ పట్టించుకోకపోవడంతో అక్కడి పరిసరాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అమరవీరుల స్థూపం వద్ద ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



కొడంగల్ రూరల్: రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయ్‌కుమార్



కులకచర్ల: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మురళీధర్

కొడంగల్ రూరల్, మే 18: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కొడంగల్ తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని పర్సాపూర్ గ్రామంలో ఐకేపీ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శనివారం పరిశీలించారు. కేంద్రానికి వచ్చే రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని లారీల్లో మిల్లులకు తరలించాలన్నారు. అనంతరం కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం వెంకన్న, మహిళా సంఘం సభ్యులు, బుక్‌కీపర్ పాల్గొన్నారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

కులకచర్ల: కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం బస్తాలను వెంటనే రైసుమిల్లులకు తరలించాలని తహసీల్దార్ మురళీధర్ అన్నారు. కులకచర్లలోని ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. అక్కడ రైతులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. అకాల వర్షాల దృష్ట్యా కాంటాపెట్టిన వెంటనే ధాన్యం బస్తాలను లారీల్లో లోడ్ చేసి రైసు మిల్లులకు తరలించాలని సూచించారు. ధాన్యం లోడ్ చేసేందుకు అవసరమైన లారీలను కేంద్రాలకు పంపిస్తామని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో వారం రోజుల్లో కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని నిర్వాహకులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీయం శోభ, సీసీలు శ్రీనివాస్, వెంకట్ పాల్గొన్నారు.

వైభవంగా వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి



వికారాబాద్: పూజల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరమేష్



పరిగి: సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

వికారాబాద్, మే 18: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి జయంతిని పురస్కరించుకొని శనివారం ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య భవనం నుంచి మహిళలతో రామమందిరం వరకు కళాశాల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మహాభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరమేష్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో వికారాబాద్ పట్టణ ప్రజలు చల్లగా ఉండాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు మాలే లక్ష్మణ్‌గుప్త, శిరీష, ఆర్యవైశ్యసంఘం నాయకులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తాండూరు: తాండూరు పట్టణం నగరేశ్వర ఆలయంలో కొలువుదీరిన వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు శనివారం రెండవ రోజున కనుల పండువగా నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున కార్యక్రమాలను చేపట్టారు. అమృత కలశాలతో ఆర్యవైశ్య కల్యాణ మండపం నుంచి నగరేశ్వర ఆలయం వరకు ఊరేగింపు, ఆర్యవైశ్య మహిళలతో అమ్మవారికి క్షీరాభిషేకం, నగరేశ్వరుడికి జలాభిషేకం, కుంకుమార్చన, కన్యలపూజ, అమ్మవారికి డోలోరోహణం, పల్లకీసేవ, మహాప్రసాదం వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. ఆర్య వైశ్య సంఘం, ఆర్య వైశ్య యువజన, నగరేశ్వర దేవస్థాన పాలకమండలి, భజన మండలి, వాసవీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారి శోభయాత్రను నగరేశ్వర ఆలయం నుంచి వినాయకచౌక్, శాంతమహల్‌చౌక్, భద్రేశ్వరచౌక్, గాంధీచౌక్ మీదుగా తిరిగి నగరేశ్వర ఆలయానికి చేరుకుంది. రెండు రోజుల పాటు జరిగిన ఈఉత్సవాలు శనివారం ముగిశాయి.

పరిగి: పరిగిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం శ్రీవాసవీమాత జయంతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. జయంతి కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, 10 గంటలకు అమ్మవారి జీవిత చరిత్ర పారాయణం, లలితా సహస్రనామం కార్యక్రమాలు నిర్వహించారు. సామూహిక కుంకుమార్చన, అమ్మవారికి ఓడిబియ్యం, మంగళహారతి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి శోభయాత్ర నిర్వహించారు. పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి వాసవీమాతను దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్ర మంలో ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు పి.మధుసూధన్, మహిళ అధ్యక్షురాలు పి.సువర్ణ, పట్టణ ప్రధానకార్యదర్శి వేముల కిరణ్, కోశాధికారి వెంకటేశం, ఉపాధ్యక్షుడు మల్లేశం, సంఘం నాయకులు రాజేశ్వరి, సంగీత, లావణ్య, స్వాతి, వాణి పాల్గొన్నారు.

కొడంగల్: శ్రీ వాసవి కన్యాక పరమేశ్వరి జయంతి ఉత్సవాలను కొడంగల్‌లో ఘనంగా నిర్వహించారు. స్థానిక అభయాంజనేయస్వామి ఆలయం నుంచి శనివారం నగరేశ్వరస్వామి ఆలయం వరకు అమ్మవారి పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్‌గుప్త, ఎన్.ప్రశాంత్, ఎల్లయ్య, విశ్వనాథం, పూరి శేఖర్, వెంకటేష్, గౌరీ శంకర్, ప్రవీణ్, చంద్రశేఖర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో..

మేడ్చల్ టౌన్: మేడ్చల్ మున్సిపాలిటీలోని శ్రీ గడిమైసమ్మ ఆలయంలో శనివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీమాత జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఆడపడుచులు అమ్మవారికి ఒడిబియ్యం, అభిషేకం, సహస్ర పూర్వక అర్చనలు, సాముహిక కుంకుమ అర్చన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షురాలు నీలిమ, అధ్యక్షుడు కొమురవెళ్లి నారాయణగుప్త, వాసవీ క్లబ్ అధ్యక్షుడు రమేష్, కృష్ణలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాళ్ళపలి జీవనజ్యోతి, రాగం సునీత, చోలేటి భవాని, శ్రీదేవి, జ్యోతి, స్వాతి పాల్గొన్నారు.



మేడ్చల్‌లో వాసవీమాత జయంతి ఉత్సవాల్లో మహిళలు



తాండూరు: పల్లకీసేవలో పాల్గొన్న స్థానికులు



కొడంగల్: పల్లకీసేవలో ఆర్యవైశ్యులు

టీఎస్ బదులుగా టీజీగా మార్చాలి

● కలెక్టర్ నారాయణరెడ్డి



వికారాబాద్, మే 18 : తెలంగాణ సంక్షిప్త పదాన్ని టీఎస్ బదులుగా టీజీగా మార్చాలని ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసిందని వికారాబాద్ కలెక్టర్ సి.నారాయణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవోలు, నోటిఫికేషన్లు, నివేదికలు, లెటర్ హెడ్‌లలో టీజీగా ఉండాలని, ప్రభుత్వ శాఖలు, సంస్థలు, అటనామస్ విభాగాలన్నీ దీనిని పాటించాలని ఆదేశించారు. తెలంగాణ ఇప్పటి వరకు వాహనాల రిజిస్ట్రేషన్‌కు మాత్రమే పరిమితమైన టీజీ నిబంధన ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా అన్నిఅధికారిక వ్యవహారాలకు వర్తింపజేసేలా ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసిందని, తక్షణమే ఇది అమల్లోకి వచ్చిందని తెలిపారు. ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశాల మేరకు ఈ మార్పునకు మే30వ తేదీన డెడ్‌లైన్‌గా ఉందని తెలిపారు. వెబ్‌సైట్‌తో పాటు అన్ని రకాల ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్లు, రిపోర్టుల్లో ఇకపైన టీజీ పదాన్నే అబ్రివేషన్ వినియోగించాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం టీజీ అనే అబ్రివేషను అధికారికంగా గుర్తించడంతో ఈ మార్పును అన్ని విభాగాలుగా అమల్లోకి తెచ్చేలా ఆయా డిపార్ట్‌మెంట్లు కార్యదర్శులు, హెచ్‌వోడీలు పర్యవేక్షించాలని సీఎస్ శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారని తెలిపారు. టీజీ అనే అబ్రివేషన్‌ను ఇకపైన అధికారింగా వినియోగించాలని రాష్ట్రంలోని అన్నిప్రభుత్వ ఏజెన్సీలు, స్వయం ప్రతి పత్తి కలిగిన (అటానమస్) సంస్థలు ఈ మార్పును కార్యాచణలో పెట్టాలని అధికారులు వాడే లెటర్ హెడ్స్, రిపోర్టులు, నోటిఫికేషన్లు, నేమ్ బోర్డులు, వెబ్‌సైట్‌లు, ఇతర అన్ని రకాల వినియోగంలో ఈ మార్పును చేపట్టాలని వివరించారు.

పోచమ్మ-మైసమ్మ ఆలయంలో అన్నదానం



భక్తులకు అన్నదానం చేస్తున్న ఆలయ నిర్వాహకులు

మేడ్చల్ టౌన్ మే 18: మండల పరిధి పూడూరులో శనివారం పోచమ్మ-మైసమ్మ అలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ ఆవరణలో శనివారం అన్నదానం చేశారు. ఉదయం అమ్మవార్లను ఆలయ పూజారి జగం శివప్రసాద్ ఆధ్వర్యంలో పట్టువస్త్రాలతో సుందరంగా ఆలంకరించారు. భక్తులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి కొబ్బరికాయలు, కట్నకానులకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు కృష్ణ, రామలింగం, శేఖర్‌రెడ్డి, సురేష్‌గౌడ్, నర్సింహాచారి, తిరుపతి, దేవేందర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో కాంగ్రెస్ నాయకులు



కొడంగల్, మే 18: కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నయీమ్ సోదరుడు సలీం కుమార్తె వివాహానికి కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. కొడంగల్ పట్టణంలోని రెడ్డి బసిరెడ్డి గార్డెన్‌లో శుక్రవారం రాత్రి నిర్వహించిన వివాహాది కార్యక్రమానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డితో పాటు నియోజకవర్గంలోని వివిధ మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హజరయ్యారు.

ఎప్ సెట్‌లో విద్యార్థుల ప్రతిభ



వికారాబాద్: విజయకుమార్‌ను సన్మానిస్తున్న సిద్ధార్థ కళాశాల కరస్పాండెంట్ కృష్ణారెడ్డి



వికారాబాద్: లెనినకు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు



దీక్షిత్ (401వ ర్యాంకు)



జయప్రకాశ్ చంద్ర (538వ ర్యాంకు)

వికారాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): టీఎస్ ఎప్‌సెట్ (ఈఏపీసీఈటీ) -2024 ఫలితాల్లో వికారాబాద్ సిద్దార్థ జూనియర్ కళాశాల విద్యార్థి ఎన్.విజయకుమార్ ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 101.44 మార్కులతో 758వ ర్యాంకు సాధించారు. అత్యుత్తమ ర్యాంకు సాధించిన విజయకుమార్‌ను శనివారం కళాశాల ప్రిన్సిపాల్ కె.జయదేవ్, కరస్పాండెంట్ డాక్టర్ పి.కృష్ణారెడ్డి, సీనియర్ అధ్యాపకులు పి.శివరాంరెడ్డి, పి.ప్రతాప్‌రెడ్డి, కె.రామాంజనేయులు, పి.రవీందర్‌రెడ్డి సన్మానించి అభినందించారు. ఇదిలా ఉంటే, పీలారం మల్లేష్ కూతురు లెనీనకు 1137వ ర్యాంకు వచ్చింది. వికారాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని కె.అంజలి ఎలాంటి కోచింగ్ లేకుండానే 18758వ ర్యాంకు సాధించిందని ప్రిన్సిపల్ సురేశ్వర స్వామి తెలిపారు.

కొడంగల్ రూరల్: ఎప్ సెట్ ఫలితాలో కొడంగల్ మండలంలోని ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పెద్దనందిగామ గ్రామానికి చెందిన కొత్తపేట దీక్షిత్ 108.29 మార్కులతో 40వ ర్యాంకు సాధించాడు. కొడంగల్ పట్టణానికి చెందిన కొంతం జయప్రకాశ్ చంద్ర 105.69 మార్కులతో 538 ర్యాంకు సాధించాడు.



నవ్యరెడ్డి (864వ ర్యాంకు)

తాండూరు: ఎప్ సెట్ పరీక్ష ఫలితాల్లో యాలాల మండలం బెన్నూర్ గ్రామానికి చెందిన పి. శ్రీనివాస్ రెడ్డి కూతురు నవ్యరెడ్డి 864 ర్యాంకు సాధించింది. తల్లిదండ్రులు, పాఠశాల కళాశాల ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● జిల్లా న్యాయాధికారి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

వికారాబాద్, మే 18: చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని వికారాబాద్ జిల్లా న్యాయాధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని అత్తేల్లి గ్రామంలో శనివారం అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సహకారంతో ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చట్టాల అవగాహన ఉండటం వల్ల వారి వారి హక్కుల కోసం హక్కుల సాధన కోసం కృషి చేయవచ్చన్నారు. బడీడు పిల్లలను బడిలో ఉంచాలని, బాల్యంలో అందరూ చదువుకోవాలన్నారు. బాల్యంలో బాల్యవివాహాలు చేయడం నేరమని వివాహ వయస్సు వచ్చాక పెళ్ళిలు చేయాలని సూచించారు. భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులు లేబర్‌కార్డులు తీసుకోవాలని వాటి ద్వారా వచ్చే ప్రయోజనాలు, ఇన్సూరెన్స్‌లను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంకిత సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ ప్రకాష్ కుమార్, ఎస్ఐ సత్యనారాయణ, లీగల్‌సెల్ న్యాయవాదులు వెంకటేష్, రాము, పంచాయతీ కార్యదర్శి కృష్ణారెడ్డి, డీఎల్ఎస్ఏ సూపరింటెండెంట్ హమీద్, సంస్థసలహాదారుడు టి.వెంకటయ్య, కో ఆర్డినేటర్ సంజీవ్, ఫీల్డ్ అసిస్టెంట్ రత్నం, బ్రాంచ్ పోస్టుమాస్టర్ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

కేసులు రాజీ అయ్యేలా చూడాలి

జూన్ 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లోఅధిక సంఖ్యలో కేసులు రాజీ అయ్యే విధంగా పోలీసులు సహకరించాలని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో శనివారం పోలీస్ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా వివిధకోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు అవి రాజీ పడదగ్గ కేసులను రాజీ పడే విధంగా పోలీసులు చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శీతల్, ప్రిన్సిపాల్ న్యాయమూర్తి శ్రీకాంత్, అదనపు జూనియర్ న్యాయమూర్తి శ్రుదిదూత, పీపీలు అన్వేష్ సింద్, సమీన బేగం, ఎస్పీ కోటిరెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, తాండూరు డీఎస్పీ బాలకృష్ణరెడ్డి, పరిగి డీఎస్పీ కారుణసాగర్‌రెడ్డి, వికారాబాద్ సీఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

తాండూరు, మే 18: తాండూరు సబ్ డివిజన్ పరిధిలోని పలు విద్యుత్ ఉపకేంద్రాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని తాండూరు విద్యుత్‌శాఖ డీఈ భాను ప్రసాద్ తెలిపారు. ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. పాత తాండూరు ఫీడర్స్ పరిధిలోని అయ్యప్ప నగర్, గ్రీన్ సిటీ, కొడంగల్ రోడ్డు, మోమిన్‌గల్లీ, గడిఏరియా, తాండూరు పట్టణంలోని వాటర్ వర్క్స్ ఫీడర్ పరిధిలో శివాజీచౌక్ ఏరియా, గంజ్ ఏరియా, పటేల్ బాగీచా, చెంగేష్‌పూర్ రోడ్డు, గాంధీ నగర్, సిటికేబుల్ ఏరియా, బషీరాబాద్ మండలం పరిధిలోని ఉపకేంద్రాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని వివరించారు.

బషీరాబాద్: మండలంలో నేడు(ఆదివారం) విద్యుత్ అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ అధికారులు శనివారం తెలిపారు. బషీరాబాద్, మైల్వార్, నవాల్గ, దామర్‌చెడ్ ఉప కేంద్రాల్లో మరమ్మత్తుల దృష్ట్యా విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

కులకచర్ల: కులకచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలో ఆదివారం చెట్ల కొమ్మల నరికివేత కారణంగా పలు సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ అహ్మద్ శనివారం ఓప్రకటనలో పేర్కొన్నారు. చౌడాపూర్, మరికల్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ముజాహిద్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలో సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని తెలిపారు. మండల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్థిక సాయం



దోమ, మే 18: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం హరిజన్ మొగులమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ సర్పంచ్ లక్ష్మీ శంకర్, గ్రామ పెద్దలు మొగులమ్మ అంత్యక్రియల నిమిత్తం ఆర్థికసాయాన్ని అందజేశారు. గ్రామంలో ఎవరికి ఎలాంటి ఆపద వచ్చినా ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హన్మంతు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

బొంరాస్‌పేట్, మే 18: కుటుంబకలహాలతో మనస్తాపం చెంది ఓవ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుముల్ మైలారం గ్రామానికి చెందిన బందెప్ప(34) కుటుంబ పోషణ కోసం హైదరాబాద్‌లో జీవనం కొనసాగిస్తున్నాడు. ఇటీవల ఇంటికి రాగా భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. శుక్రవారం రాత్రి జీవితంపై విరక్తి చెందిన చిలుముల్‌మైలారంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి అంజిలప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపారు.

యువతి అదృశ్యం

కులకచర్ల, మే 18: కులకచర్ల పీఎస్ పరిధిలోని చౌడాపూర్‌లో ఓ యువతి అదృశ్యమైంది. మండల కేంద్రానికి చెందిన యువతి(19) కులకచర్ల వివేకానంద కళాశాలలో ఇంటర్ పరీక్షలు రాసి ఇంటి దగ్గరే ఉంటోంది. శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు ఇతరుల దగ్గర, బంధువుల దగ్గర ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో యువతి తండ్రి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వృద్ధురాలి మెడలోంచి పుస్తెలతాడు అపహరణ



బాధితురాలు జెల్ల రాములమ్మ

కీసర రూరల్, మే 18: వృద్ధురాలి మెడలోంచి గుర్తుతెలియని దుండగులు పుస్తెలతాడును అపహరించుకెళ్లారు. ఈ ఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. జెల్ల రాములమ్మ(75) అనే వృద్ధ మహిళ కీసర మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామంలో తన కుమారుడి సంరక్షణలో ఉంటోంది. కాగా శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో వారంతా పొలం పనినిమిత్తం వ్యవసాయ వద్దకు వెళ్లారు. రాములమ్మ ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ఆమె మెడలోంచి నాలుగు తులాల బంగారు గొలుసును దొంగలు దోచుకెళ్లారు. దీంతో బాధితురాలి కుమారుడు గణేష్ కీసర పోలీసులకు ఫిర్యాదు చేసారు. స్పందించిన పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిసరాల్లో ఏర్పాటు చేసిన సీసీకెమెరాలను పరిశీలిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేసున్నారు.

హత్యాయత్నానికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు

కులకచర్ల, మే 18: వ్యక్తిగత కారణాలతో ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు పాలమూర్ జిల్లా నవాబుపేట ఎస్సై అభిషేక్‌రెడ్డి తెలిపారు. చౌడాపూర్ మండలంలోని మరికల్ గ్రామానికి చెందిన నర్సింహులుపై అదే గ్రామానికి చెందిన తలారి నర్సింహులు, తలారి విష్ణు, నవీన్‌కుమార్‌లు వ్యక్తిగత కారణాలతో ఈనెల 8వ తేదీన నర్సింహులుపై హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలవడంతో పాలమూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నర్సింహులు ఫిర్యాదు మేరకు శనివారం ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్‌లను అప్పగిస్తున్న ఎస్ఐ భరత్‌రెడ్డి

కొడంగల్ రూరల్, మే 18: మండలంలోని పర్సాపూర్ గ్రామానికి చెందిన జీడిమల్లేశం, బోయపల్లి తండాకు చెందిన గోవిందు, దౌల్తాబాద్ మండలం ఈర్లపల్లికి చెందిన ఎండీ.మౌలానాకు చెందిన సెల్‌ఫోన్‌లు చోరీ కాగా బాధితులు కొడంగల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీఈఐఆర్ యాప్‌ను ఉపయోగించి సెల్‌ఫోన్‌లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అట్టి సెల్‌ఫోన్‌లను ఎస్ఐ భరత్‌రెడ్డి శనివారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది కృష్ణ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృత్యువాత



విద్యుదాఘాతంతో మృతి చెందిన గేదెలను చూపిస్తున్న వాలిబాయి

బొంరాస్‌పేట్, మే 18: విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృత్యువాతపడ్డాయి. ఈ ఘటన బొంరాస్‌పేట్ మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని మెట్లకుంట పరిధిలోని మైసమ్మగడ్డ తండాకు చెందిన దిగావత్ వాలిబాయికి చెందిన మూడు గేదెలను రోజు మాదిరిగా శనివారం తండా సమీపంలో మేత మేస్తున్నాయి. ఈ క్రమంలో తెగిపడిన ఉన్న విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి. ఈ గేదెల విలువ రూ.లక్ష 50వేలు ఉంటుందని బాధితురాలు వాపోయింది. ప్రభుత్వం తరఫున తనకు ఆర్థిక సాయం అందించాలని కోరింది.

ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొని పలువురికి గాయాలు

పూడూరు, మే 18: ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొన్ని ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన పూడూరు మండలంలోని మిర్జాపూర్ గేటు సమీపంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. శనివారం హైదరాబాద్ వైపు వెళుతున్న ఆటో, పరిగి వైపు వెళుతున్న పరిగి డిపో ఆర్టీసీ బస్సు వెళుతున్నాయి. మిర్జాపూర్ గేటు సమీపంలోకి రాగానే బస్సు, ఆటో ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో, బస్సులో ఉన్న ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఆర్టీసీ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రయాణికులు ప్రాణాపాయం తప్పింది. దీంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

ఆటోను అపహరించుకెళ్లిన నిందితుడు రిమాండ్



నిందితుడు సాయికుమార్

ఘట్‌కేసర్ రూరల్, మే 18: పార్కు చేసిన ఆటోను అపహరించుకెళ్లిన నిందితున్ని పోచారం ఐటీసీ పోలీసులు అరెస్టుచేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.... ఘట్‌కేసర్ మండలం, ఘనాపూర్‌కు చెందిన గుండ బద్రయ్య ఈ నెల ఈ నెల 12 రాత్రి (టీఎస్ 13 యుఎ 9812)కు హ్యాండిల్‌లాక్ చేసి ఇంటి ముందు పార్కు చేసి నిద్రపోయారు. పోచారం మున్సిపల్, అన్నోజిగూడ రాజీవ్‌గృహకల్పకు చెందిన నలుగురోళ్ళ సాయికుమార్ ఘనాపూర్‌లో పార్కు చేసిన ఆటోకు డిప్లికేట్ తాళంచెవితో లాక్ తీశాడు. మరుసటి రోజు ఆటోను నగరంలో విక్రయించడానికి ప్రత్నించగా ఒజినల్ పత్రాలు లేవని ఆటోను ఎవరు కొనుగోలు చేయలేదు. దీంతో శనివారం యాదగిరిగుట్టలో ఆటోను విక్రయించడానికి వెళ్తుతుండగా యంనంపేట్ చౌరస్తా వద్ద సాయికుమార్‌ను అదుపులోకి తీసుకోని ఆటోను స్వాధీనం చేసుకున్నారు. సాయికుమార్‌ను రిమాండ్‌కు తరలించి, కేసు నమోదు చేసుకోని ధర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కురిసిన వాన.. చల్లబడిన వాతావరణం



నవాబుపేటలో కురుస్తున్న వర్షం

నవాబుపేట, మే 18: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శనివారం అకాల వర్షం కురిసింది. ఎండ వేడిమితో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు వర్షంతో వాతావరణం చల్లబడటంతో ఉప శమనం పొందారు. కురుస్తున్న వర్షాలతో రైతులకు మేలు జరుగుతుందని పలువురు రైతులు భావిస్తున్నారు. ఇదీలా ఉండగా అకాల వర్షాల కారణంగా కల్లాల్లో ఉంచిన వరి ధాన్యం తడిసి పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.